క్లుప్తంగా

మునిసిపల్ కమిషనర్‌గా నజీర్ బాధ్యతల స్వీకరణ



పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా షేక్ నజీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కమిషనర్‌గా పని చేసిన భవానీప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నజీర్ కమిషనర్‌గా వచ్చారు. నజీర్ గతంలో ఏపీ సచివాలయంలో జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా ఫారిన్ సర్వీస్‌లో పని చేశారు. ఆయన తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్‌గా డెప్యూటేషన్‌పై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన భవానీప్రసాద్ కమిషనర్ అండ్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో సోమవారం సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సంస్థ(ఆర్డిస్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ ఎస్. కాళహస్తి మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అనేక పథకాలు, రాయితీలతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు కల్పిస్తున్న ప్రయోజనాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల విస్తరణ విభాగాధిపతి డాక్టర్ శిరీష మాట్లాడుతూ డిజిటల్ యుగంలో బ్యాంకింగ్‌పై అవగాహన యువతకు అవసరమన్నారు. రిసోర్స్ పర్సన్-2 ఆర్‌ఎస్ శంకరరావు, సహాయ ప్రొఫెసర్ బి. మస్తాన్‌బీ, ఆర్డిస్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, కార్యదర్శి వై. సాంబశివరావు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా దివ్య రథానికి స్వాగతం



కంకిపాడు: శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా స్వామి వారి ప్రేమ ప్రవాహిని దివ్య రథం ఆదివారం రాత్రి కంకిపాడు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు దివ్య రథానికి సాదర స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామిని ఆహ్వానించి పూజా కార్యక్రమాలు జరిపించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో ధ్యాన యోగ సాయి మందిరం ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు పుష్పవతి, వైస్ ప్రెసిడెంట్ కడియాల నాగప్రసాద్, శ్యామల పూర్ణకుంభంతో రథానికి స్వాగతం పలికి హారతులు పట్టారు. సత్యసాయి సేవాసంస్థ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త సనక పూర్ణచంద్రరావు, రాంబాబు, నాగేశ్వరరావు, ఓగిరాల గణేష్, రావి రమేష్, నందం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

విజయవాడ కల్చరల్: వాసవీ సేవా సంస్థలు సామాజిక సేవతో పాటు సాంస్కృతిక కళారంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ దిశగా కార్యాచరణ చేయాలని వాసవీ సేవా సంస్థల అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవీ క్లబ్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సభ్యుల సమాలోచన కార్యక్రమం ఉదయాస్తమాన సేవలు 48 గంటలపాటు నిర్వహించిన నిర్విరామ సేవలు సోమవారం ముగిశాయి. గాంధీనగర్‌లో జరిగిన సమావేశంలో గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 35 శాఖల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లోని అన్ని ప్రధాన నగరాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ తాగునీరు, వైద్య సేవలను అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ బెంచీలు నిర్మాణం చేశామని, పేద కళాకారులకు నెల వారీ నిత్యావసర వస్తువులను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సమీక్ష సమావేశంలో వాసవీ క్లబ్ కీలక నిర్వాహకులు మాజేటి హరిప్రసాద్, దర్శి శ్రీనివాసరావు, ముదుపల్లి భాస్కర్, కొత్తమాసు విశ్వనాథం, కె.సుజాత లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు. పేద కళాకారులకు నిత్యావసరాలను అందించారు.

రోడ్డు ఛిద్రం.. జర్నీ జర భద్రం

- గోతులమయంగా కంకిపాడు-గన్నవరం రోడ్డు మార్గం
- ప్రమాదకరంగా రాకపోకలు
- తూతూ మంత్రంగా మరమ్మతులు



ఉప్పలూరు ప్రధాన సెంటరులో ఏర్పడ్డ పెద్ద గొయ్యి

కంకిపాడు: అడుగడుగునా గోతులు.. పెద్ద పెద్ద అగాధాలతో కంకిపాడు-గన్నవరం రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి గన్నవరం వద్ద విజయవాడ-ఏలూరు జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు మార్గం కంకిపాడు-గన్నవరం రోడ్డు. రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రెండు మండలాల మధ్య నిర్మితమైంది. విమానాశ్రయానికి వెళ్లేందుకు ప్రజలు దీన్ని ప్రధానంగా వినియోగిస్తున్నారు.

అంతటా గోతులే..

గన్నవరం రోడ్డు కూడలి మొదలు దారి మొత్తం గోతులమయంగా మారింది. పునాదిపాడు అండర్ పాస్, హైస్కూల్ సెంటరు, కొత్తూరు, కాటన్ సర్కిల్, ఉప్పలూరు వంతెన డౌన్, ఉప్పలూరు-వేల్పూరు కూడలి, కొత్తూరు సెంటరు, బుడమేరు పరిసరాల్లో రోడ్డు ఎక్కడ చూసినా అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు, కోతకు గురైన రోడ్డు మార్జిన్‌లతో అస్తవ్యస్తంగా ఉంది. ఎగుడుదిగుడు రోడ్డుపై ప్రయాణం సాఫీగా సాగక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గోతుల మయంగా మారిన రోడ్డుమీదుగా రాకపోకలు సాగటం లేదు. రాత్రిళ్లు ఈ మార్గంలో ఉన్న పెద్ద పెద్ద గోతులు కనిపించకపోవటంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి.

చినుకు పడితే చెరువులే..

మోస్తరు వర్షం కురిసినా కంకిపాడు-గన్నవరం రోడ్డు చెరువును తలపిస్తోంది. గోతుల్లో నీరు నిలిచిపోయి రోజుల తరబడి కదలటం లేదు. ఉప్పలూరు సెంటరు, పునాదిపాడు అండర్ పాస్‌లు నీటితో నిండిపోయి, బురదకయ్యగా మారుతోంది. దీంతో గన్నవరం, గుడివాడ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు మురుగులో వాహనాలు నడపలేక అవస్థలు పడుతున్నారు. మురుగునీటి తటాకాలు తయారై ప్రమాదకరంగా మారిన రోడ్డు గుండా రాకపోకలు సాగించలేకపోతున్నామంటూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి నిర్లక్ష్యం..

అన్ని ప్రధాన రహదారులను ఏడాది లోపు అభివృద్ధి చేస్తామని కూటమి సర్కారు ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేసే ఈ రోడ్డును మాత్రం నిర్లక్ష్యం చేసింది. దీంతో రోడ్డు మొత్తం గోతులతో, అగాధాలతో అధ్వానంగా మారింది. కూటమి నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా పరిణమించిందంటూ పలువురు పెదవి విరుస్తున్నారు.



పునాదిపాడు వద్ద ఛిద్రమైన రోడ్డు మార్గం



పునాదిపాడు హైస్కూల్ వద్ద ధ్వంసమైన రోడ్డు

అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి చర్యలు



మద్దూరు ఏటిపాయలో డ్రోన్ ఎగుర వేస్తున్న సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్, సిబ్బంది

కంకిపాడు: కరకట్ట వెంబడి, ఏటిపాయలో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్ తెలిపారు. మండలంలోని మద్దూరు ఏటిపాయ పరిసరాల్లో డ్రోన్ సహాయంతో పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను సోమవారం గుర్తించారు. ఈ సందర్భంగా సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్ మాట్లాడుతూ ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు ఏటిపాయలోని లంక ప్రాంతంలో కోడిపందేలు, పేకాట నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను డ్రోన్ ద్వారా నిర్ధారించారు. ఆయా ప్రాంతాలపై నిత్యం నిఘా ఉంటుందని, తనిఖీలు ముమ్మరంగా చేపట్టి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదేశాలు ఉల్లంఘించి జూద శిబిరాలు నిర్వహించేందుకు తెగబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పర్యటనలో అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీనేజర్లూ తస్మాత్ జాగ్రత్త



మాట్లాడుతున్న సీఐ రామారావు

ఉయ్యూరు: బాలికలు మాయమాటలకు, ప్రలోభాలకు లోనవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు సీఐ రామారావు సూచించారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో బ్యాడ్ బాయ్ క్రష్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సీఐ రామారావు మాట్లాడుతూ యుక్తవయస్సులో బాలికలు బాధ్యతగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకుని మహిళలకు కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెడ్డ వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే సమాచారాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ శివసాయి పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభం..

పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద రూ. 4.50 లక్షలు అంచనా వ్యయంతో వాకింగ్ ట్రాక్ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ ప్రారంభించారు.

కనీస గౌరవం ఇవ్వడం లేదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. స్థానిక మహాత్మా గాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన సోమవారం బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆద్యంతం ప్రొటోకాల్‌పై సభ్యులు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఎంపీటీసీ సభ్యులను ఆహ్వానించకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఆయా కార్యక్రమాల సమాచారం కూడా అధికారులు తెలియజేయటం లేదని వాపోయారు. ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలు దీర్ఘకాలంగా చెల్లించటం లేదని, వెంటనే ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయిందని, దీంతో కనీసం వైద్యం అందించే వసతి లేక నానా ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఏవో త్రినాథరావు, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పడకల కోటేశ్వరావు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు వైఎస్సార్ సీపీ చేయూత



నాగన్నగూడెంలో ఏసుబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉయ్యూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉయ్యూరు, కంకిపాడు మండల అధ్యక్షులు దాసే రవి, మాదు శ్రీహరిరాణి అన్నారు. ఉయ్యూరు మండలంలోని సాయిపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు మెరుగుమాల భూషయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధితుడిని పార్టీ శ్రేణులు సోమవారం పరామర్శించాయి. పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కలపాల వజ్రయ్య, నందేటి ప్రకాష్, దాసరి ధర్మరాజు, నున్న శ్రీనివాసరావు, గుండె బాలాజీ పాల్గొన్నారు.

నాగన్నగూడెంలో..

ఉయ్యూరు శివారు నాగన్నగూడెంలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు గుంజా ఏసుబాబును పార్టీ శ్రేణులు సోమవారం పరామర్శించాయి. దేవభక్తుని చక్రవర్తి తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, కౌన్సిలర్ గుంజా సుధాకర్ అందించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు ఉయ్యూరు సుధాకర్, కొల్లి వసంత, బాలి, మహేష్, పృథ్వీ పాల్గొన్నారు.

రైతులకు అందని ధాన్యం సొమ్ము

గగ్గోలు పెడుతున్న అన్నదాతలు



ధాన్యం బస్తాలతో రైతు (ఫైల్)

పెనమలూరు: మండల పరిధిలో దాళ్వా సాగు చేసిన రైతులకు ధాన్యం సొమ్ము అందక పోవటంతో గగ్గోలు పెడుతున్నారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేసినా.. ఆచరణలో మాత్రం అలా జరగటం లేదు. దీంతో ధాన్యం మిల్లులకు తరలించిన రైతులు సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలో దాళ్వా వరి సాగు మండలంలో దాదాపు 5వేల ఎకరాల్లో జరిగింది. పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఆలస్యంగా ధాన్యం కొనుగోలు చేపట్టింది. దీంతో తొలిదశలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత ధాన్యం కొనుగోళ్లు జరిగినా అనేక అవాంతరాల మధ్య మిల్లులకు తరలించారు. మిల్లులకు వెళ్లిన ధాన్యానికి వారం రోజుల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మరలా కొద్ది రోజుల తర్వాత బ్యాంక్ గ్యారంటీ లేదని రైతులు వద్ద ధాన్యం కొనుగోళ్లు చేయలేదు. మరలా రైతులు ఆందోళన వ్యక్తం చేయటంతో ప్రభుత్వం నానా తంటాలు పడి ధాన్యం కొనుగోళ్లు చేసింది.

45 రోజులుగా అందని సొమ్ము..

కాగా మండల పరిధిలో రైతులు అమ్మిన ధాన్యానికి గత 45 రోజులుగా ప్రభుత్వం సొమ్ము చెల్లించలేదు. మండలంలో ఏడు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 6,336 టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేశారు. దీనికి గాను రూ. 5.30 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ. 4.42 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఇంకా రూ. 87.93 లక్షలు ధాన్యం సొమ్ము రైతులక ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గత 45 రోజుల క్రితం రైతులు అమ్మిన ధాన్యం సొమ్ము ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించలేదు. రైతులు రైతుసేవా కేంద్రాలు, సొసైటీల చుట్టూ తిరుగుతున్నా వారికి సమాధానం చెప్పేవారు కనబడటం లేదు. గత ప్రభుత్వ పాలనలో వారం రోజుల్లోనే ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారని, కూటమి పాలనలో 45 రోజులు గడిచినా పంట సొమ్ము అందలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు రైతులు కష్టాలు గుర్తించి వెంటనే ధాన్యం సొమ్ము చెల్లించాలని రైతులు కోరుతున్నారు. త్వరలో రైతుల సొమ్ము చెల్లిస్తారని అధికారులు చెబుతున్నా.. వారి మాటల్లో స్పష్టత లేకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దళితులపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



గన్నవరంలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నేతలు

గన్నవరం: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లంపల్లి అంజనేయులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో పెత్తందారులందరూ ఏకమై దళిత పల్లెలను వెలివేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో దళిత మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన దళిత వర్గాలను కలవర పెట్టిందన్నారు. తెనాలిలో నడిరోడ్డుపై దళిత, మైనార్టీ యువకులను పోలీసులు చితకబాదిన సంఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిందన్నారు. రాష్ట్రంలో ఇటువంటి దుర్మార్గపు సంఘటనలు జరుగుతున్న ప్రభుత్వం కళ్లుండీ చూడలేని గుడ్డిదానిగా తయారైందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘ నేతలు టీవీ. లక్ష్మణస్వామి, చిగురుపల్లి నాగరాజు, కళ్లం నాని, అరుణ్, ఆంథోని, మిరప నాగేశ్వరరావు, కై లే ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



చల్లపల్లి: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై రూ.3లక్షలు ఆస్తినష్టం సంభవించిన ఘటన మండల పరిధిలోని వెలివోలు గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సీ ఏరియాకు చెందిన కొడాలి ఝాన్సీ కూరగాయలు తరిగే పనికి వెళుతుంటుంది. రోజూ లాగానే పనికి వెళ్లగా ఇంటి లోపల ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. మొవ్వ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఇంటిలోని వస్తువులు, ఆభరణాలు అన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో ఝాన్సీ కట్టుబట్టలతో మిగిలింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందన్నారు.

ములకలమ్మ చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు



చెరువులో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి, నాయకులు

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పేర్కొన్నారు. సోమవారం ఆమె పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 18 రోజుల నుంచి ములకలమ్మ చెరువులో లారీకి రూ.7వేలు, ట్రాక్టర్‌కు రూ.600 తీసుకుని మట్టి అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటుక బట్టీలకు వేల ట్రాక్టర్‌లు మట్టిని నిల్వ చేశారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సాయంత్రం 5గంటలు దాటితే ఒక ట్రాక్టర్ మట్టి బయటకు తోలరని చెప్పిన ఎమ్మెల్యే.. రాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని లారీలతో తరలిస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రజలు ఆలోచించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి సుబ్బారెడ్డి, బత్తుల లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 24వ తేదీ నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 24న చలివేంద్రపాలెం పంచాయతీలోనూ, 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ ఉప్పలూరు సచివాలయంలోనూ, 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ పునాదిపాడు సచివాలయంలోనూ ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. 0-6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు తప్పనిసరి అని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దాతల సహకారం అభినందనీయం



పిన్నమనేని సిద్ధార్థలో లాపరోస్కోపిక్ యూనిట్ ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్, సిద్ధార్థ యాజమాన్యం

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రికి విజయవాడ రోటరీ క్లబ్ శ్రీ దుర్గ, రోటరీ క్లబ్ జఫెర్సన్ సిటీ ఈవినింగ్ సంయుక్తంగా ఆధునిక లాపరోస్కోపిక్ సర్జరీ యూనిట్‌ను సోమవారం అందజేశారు. రూ.55 లక్షలు విలువ చేసే స్ట్రైకర్ కంపెనీ లాపరోస్కోపిక్ అధునాతన పరికరాలను సమకూర్చారు. పేద ప్రజల వైద్యానికి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రి అందిస్తున్న సేవలు నిరుపమానమని ముఖ్య అతిథి రోటేరియన్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. అధ్యక్షులు, ప్రెసిడెంట్ రొటేరియన్ శ్రీనివాసరావు, సుబ్బారావు, రావూరి దత్తు, కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, సర్జరీ విభాగాధిపతి ఎం ఎం రెహమాన్, ఏవో టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సంగీత సద్గురువుల ఆరాధనా మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 74 వ వర్ధంతి సందర్భంగా శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యంలో ఈనెల 26 వ తేదీ గురువారం నుంచి 30 వ తేదీ మంగళవారం వరకు సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మోదుమూడి సుధాకర్ తెలిపారు. శివరామ కృష్ణ క్షేత్రంలో ప్రతి రోజూ సాయంత్రం సంగీత కార్యక్రమాలు జరుగుతాయని సద్గురు త్యాగరాజ స్వామి శిష్య పరంపరకు చెందిన వారు 100 మంది ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

28వ తేదీ ఉదయం అలంకార్ సెంటర్‌లోని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహం వద్ద పుష్పాంజలి, 29వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు త్యాగరాజ స్వామి రచించిన ఘన పంచ కృతుల గోష్ఠిగానం ఉంటుందని తెలిపారు.

బాపులపాడు పీహెచ్‌సీ వైద్యులుగా మధు, శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ మధు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎంజే మంజూషా రామపురం పీహెచ్‌సీకి బదిలీ కావటంతో ఆమె స్థానంలో డాక్టర్ మధు వచ్చారు. మరో వైద్యుడు నారయ్య పీజీ కోర్సులో జాయిన్ కావటంతో గత రెండు నెలలుగా ఖాళీ ఉన్న పోస్టులో యలమర్రు పీహెచ్‌సీ నుంచి డాక్టర్ శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ముమ్మరంగా పూడిక తొలగింపు పనులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని బూరుగుల చెరువులో సాగు నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపర్చడానికి పూడిక తొలగింపు పనులు చేస్తున్నట్లు సాగు నీటి సంఘం అధ్యక్షుడు ఎం.వెంకట సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం నున్నలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు ఆయకట్టు 300 ఎకరాల వ్యవసాయ భూములు పూర్తిగా వర్షాధారం అయినందున ఆయకట్టు భూములకు సాగునీటి కొరత రాకుండా పూడిక పనులు చేస్తున్నామన్నారు. పూడిక తొలగింపు పనులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు సహకారంతో జరుగుతున్నాయన్నారు. పూడిక తీసిన మట్టిని వ్యవసాయ పొలాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కె.రమేష్, ఎస్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.